


అంతబలమైన రైలుబండీ అతి సాధారణమైన పట్టాల మీద నిబ్బరంగా పరుగెడుతోంది తన విధి నిర్వహణలో లగ్నమై.

ఆ రైలుబండిలో రకరకాల మంది ప్రయాణం. అందులో రామారావు పిల్లల్తో, భార్య తేజోవతి, తల్లి నాగమ్మతో స్వంత ఊరొస్తున్నాడు చూసిపోవడానికి.

రామారావుకి విజయనగరంలో చిన్ని ఉద్యోగం. ఉద్యోగం పురుషలక్షణం అంటూండేవారు తెలుగు మాష్టారు పరమశివంగారు ఆయన ఈ లోకంతో గల సంబంధాల సంకెళ్లను తెంచుకుపోయారు. ఆయన బోధించిన పాఠాలు రామారావు రక్తం నిండా కలిసిపోయాయి

ప్రయాణం మధ్యలో ఓ యువకుడు రామారావున్న కంపార్టుమెంట్లో కొచ్చిపడ్డాడు రైలు ప్రయాణం కొత్తగామోసు, సామానులతో తిరకాసు పడుతున్నాడు. చూస్తుంటే చాదస్తం అతణ్ని తరుముకొస్తున్నట్టుంది. జీవన్‌టోన్ ఎడ్వర్‌టైజ్-మెంట్‌కి పనికిరాడు సరికదా అతణ్ని ఏ టానిక్కు కంపెనీ కనుచూపు మేరల్లోకి రానీయదు

రామారావే కలుపుగోలు తనంగా రెండుమూడు-సార్లు మాట్లాడాడు ఆ యువకునితో. ఆ యువకుడు మాత్రం అంటీ అంటనట్టు మాట్లాడి ఊరుకున్నాడు. మధ్య మధ్య బీడీల్తో కుస్తీ పట్టులు కూడా ప్రారం-భించాడు.

రైలు నరసాపురం చేరుకుంది; చీకటి వెలుగుల శాలువా దులుపుకుంది ఉషః కాంతిలో. శరీరం పరుచుకుని.

రామారావు తల్లీ పిల్లలూ భార్యా రైలు దిగేశారు. సామానుతో ఆ యువకుడు దిగలేక కంపార్టు-మెంటుని బాధపెట్టేస్తుంటే,

"పాపం మీరేం బాధపడతారు, నేను సహాయం చేస్తాను" అంటూ రామారావు సహాయం చేయబోతే అతనికి భార్య తేజోవతి ఓ చెయ్యి అందించింది ధర్మపత్ని కనుక.

తమ తోవను తాము పోకుండా యిలా పరాయి-వాళ్ల బరువుకూడా తమ శిరస్సున ధరిస్తారా అనుకున్నాడు ఆ యువకుడు. అటువంటి మంచి-వాళ్లనెప్పుడూ చూడలేదు కనుక.

దించిన సామాను రైల్వే గేటువరకూ తెచ్చుకో-బోయి మళ్లీ అవస్థపడుతుంటే అప్పుడు కూడా కొంత సామాను రామారావు తీసుకుని గేటు బయట వరకూ తెచ్చిపెట్టాడు.

రామారావు ఇద్దరు రిక్షా కార్మికులకు పనిపెట్టాడు. ఒక రిక్షాలో తన భార్యనూ తల్లినీ కూర్చోబెట్టాడు ఉన్న కొంచెం లగేజీ అందులో వేసి. తక్కినదాంట్లో పిల్లలిద్దర్తో కూర్చున్నాడు. అయినా రిక్షా గర్భాన ఖాళీ ఉంది.

"బస్టాండు వరకూ వెళ్తాం. మీరు కూడా రండి" ఆహ్వానించాడు రామారావు ఆ యువకుణ్ణి.

"అబ్బే యెందుకులెండి. నెమ్మదిగా నడిచేస్తాను. యిదేగా మా ఊరు. "కొమ్మల్లో దాగిన పక్షిలా ప్రాణభయంతో అన్నట్టున్నాయి అతని మాటలు.

"మాకు కంపెనీగా బసెక్కుతారేమోననుకుంటున్నానండి"

అప్పుడే స్నేహజ్యోతి వెలిగించేసుకుంటున్నారు.- శ్రీవారు అనుకుంది భర్త గుండె లో తులిరిగిన తేజోవతి.

"మీ యింటికి దగ్గర తోవ యెటో చెప్పండి. అలా రిక్షా తీసుకెళ్ళి మిమ్మల్ని మీ యింటికి దగ్గర్లో వదలి మేం తిన్నగా బస్టాండుకి వెళ్తాం" అన్నాడు రామారావు. అతనిలో దివ్యమైన ప్రేమజ్యోతి దర్శించే తీవ్ర ప్రయత్నంలో.

యువకుడు మరీ రాదు కాదు కనుక రామారావు ఆహ్వానానికి వికసించేడు రిక్షా యెక్కాడు. మాటా మంచీ ఊపిరి పోసుకున్నాయి.

ఆ యువకుని పేరు విశ్వేశ్వర్రావు.

లోకల్ హైస్కూల్లో వెలుగులు పంచే తెలుగు పంతులు.

రామారావుకి తెలుగు మాష్టార్లంటే అభిమానం. ప్రేమ. భక్తి.

రిక్షా దిగిపోయి వెళ్ళిపోబోయి తటపటాయించాడు. సంస్కారమంటే తెలియదనుకుంటాడని కాబోలు "మీరెప్పుడయినా మా యింటికి రండి. యిక్కడికి వో వంద అడుగుల దూరంలో ఆ వీధి మలుపులో ఉంటున్నా" అన్నాడు విశ్వేశ్వర్రావు ఇక తప్పక.

అతను కేవలం మర్యాద ముసుగులో దూరి, పెదాల్ని ఆడించాడు తప్ప అంత విశాలమైన గుండె వుంటే అది తనకే భారం తన కొంప నిజంగా ఓ పెద్ద రొంపు. అనేక పట్టింపుల ఉక్కు పిడికిల్ల మధ్య మరో పాషాణం తాను.

భార్య వో పెద్ద ముళ్లకంప. అంతకంటే ఇనపముళ్లకంచె తాను. విశ్వేశ్వర్రావు తల్లి వుంది. బతికే ఉంది. ఆమె యింకా బతికున్నందు విశ్వేశ్వర్రావుకి బయటకు చెప్పలేనంత మంట.

రామారావు తన తల్లి గురించి చెబుతూ "మా నాన్నగారు కాలం చేసినప్పట్నుంచీ మా అమ్మగారిని నా దగ్గరే ఉంచు కుంటున్నాను. ఆ మధ్య పక్షవాతం వచ్చింది. రాత్రింబవళ్ళు నేను చేయగలిగిన ఉపచారాలన్నీ చేశాను. ఆ దేవుడు ఉన్నాడు సుమండీ. మా అమ్మ కొంచెం కోలుకుంది. ఈ లోకంలో మనక్కావలసిందేముంది తల్లి ఆశీర్వాదం తప్ప. ఆమే కదా కళ్లెదుట కనిపించే దేవత."

విశ్వేశ్వర్రావుకి ఆ మాటలు తేనె టీగల తుట్టగా ఉన్నాయి. రామారావు "వెళ్ళొస్తా మాస్టారూ" అంటూ నమస్కరించాడు. సంస్కారమూ, ఆత్మీయతా- గ్రీష్మంలో వర్షంలా ఉన్నాయి.

విశ్వేశ్వర్రావు రక్తంలో జెర్రులూ, తేళ్ళూ పాకాయి.

నెల రోజులు రాకెట్ స్పీడ్‌లో వెళ్ళాయి. రామారావుకి మళ్ళీ తిరుగు ప్రయాణం దగ్గర్లో ఉంది. స్టేషన్‌కి రిజర్వేషన్‌కని వెళ్లాడు రిజర్వేషన్ కౌంటర్లో పనయ్యాక తరువాత తిరిగి వస్తుంటే విశ్వేశ్వర్రావు మాష్టారు బొమ్మ బ్రెయిన్ మీద కొచ్చింది. అంత పెందలాడే వెళ్ళినా బస్సుకోసం రెండు గంటల కాలాన్ని ఖూనీ చెయ్యాలి. కనుక ఓసారి విశ్వేశ్వర్రావు మాష్టార్ని కలుసుకొని, అతని స్నేహంలో గల గొప్పతనం చవిచూడాలనీ, అదో అపురూపమైన స్మృతిగా దాచుకోనాలనీ బయలుదేరాడు.

సగం దూరం నడిచిన తర్వాత ' విశ్వేశ్వర్రావు మాష్టారు యిల్లెక్కడండీ?' అనడిగాడు ఒకతణ్ణి.

"అంటే అప్పట్లో పరమశివం పంతులుగారుండేవారు. వారబ్బాయేనాండి?"

ఏమిటి! విశ్వేశ్వర్రావు తన గురుదేవులైన పరమశివం మాష్టారు గారబ్బాయా? మరికొన్ని ప్రశ్నల పిదప విశ్వేశ్వర్రావు పరమశివం మాష్టారు గారబ్బాయే నని రూడయ్యింది.

శిలలాటి తనను మనిషిగా మలిచిన మహాబ్రహ్మ ఆయన.

అంతటి మహానుభావుని జీన్స్ నుండి పండిన కొమరుడు విశ్వేశ్వర్రావు.

పరమశివం మాష్టారు అనేక విద్యార్థుల హృదయక వాటాలు తెరచి అందులో విజ్ఞాన దేవతను ప్రతిష్ఠించి ఆత్మను తేజోమయం చేసిన గొప్ప మనీషి. స్వయంగా ఆచరిస్తూ, తమ విద్యార్థుల చేత ఆచరింపజేసే అసాధారణ వ్యక్తి. రామారావుకి హృదయంలో దాగిన గురుభక్తి భూదేవిని బద్దలగొట్టు కొచ్చిన జలవాహినిలా మారింది. తనువు పులకరించి పోయింది. ఆయన దర్శనభాగ్యం యిక కలగదు. కనీసం ఆయన సుపుత్రుని మరోసారి దర్శించి తన గురుభక్తిని వెల్లడించుకునే అవకాశం కలిగినందుకు జీవితం ధన్యమయ్యింది కదా ననుకున్నాడు.

ఆ వ్యక్తి "యిదేనండి పరమశివం పంతులుగారబ్బాయి యిల్లువాళ్ల ఊళ్లో యిల్లు అమ్మేసి యిక్కడ అద్దె యింట్లో ఉంటున్నారు. పంతులుగారబ్బా యున్నాడే, చాలా ఘటికుడు లెండి" అన్నాడు వ్యంగ్యంగా.

రామారావుకేం చెప్పాలో తెలీక కృతజ్ఞతలు చెప్పి ముందుకి నడిచాడు.

రామారావు మెట్లెక్కాడు. ఆనందబాష్పాలు పొర్లుకొస్తున్నాయి. దగ్గరగా మూసివున్న తలుపు దగ్గరకెళ్లి "మాష్టారూ!" అని పిలుద్దా మనుకున్న వాడల్లా లోన యేదో గొడవ విని గుండెల్లోంచి తూటా దూసుకెళ్లిన వాడిమల్లే నిలబడిపోయాడు.

"కన్న తల్లినైన నన్నిలా చిత్రహింసలు పెట్టడం నీకు భావ్యం కాదురా బాబూ" ఆక్రోశిస్తున్న ఒ ముసలి కరం.

# కలిసి మెలసి బ్రతుకుదాం

కలిసి పాడు తమ్ముడూ
అపస్వరం భయముండదు
కలిసి చదువు తమ్ముడూ
అపశబ్దం భయముండదు
కలిసి ఆడు తమ్ముడూ
అపజయాల భయముండదు
కలిసి నడువు తమ్ముడూ
అపహారం భయముండదు
కలిసి బ్రతుకు తమ్ముడూ
అపయానం భయముండదు

* *

చూడ నొక్క చుక్క కన్న
చుక్కల గమి అందంరా
చూడ నొక్క పూవు కన్న
పూల గుత్తి అందంరా
చూడ నొక్క మబ్బు కన్న
మబ్బుల పరి అందంరా
చూడనొక్క గువ్వ కన్న
గువ్వల పిండందంరా
చూడ నొక్క జింక కన్న
జింకల దాటందంరా
చూడ నొక్క దివ్వె కన్న
దివ్వెల బారందంరా

*

కలయికలో శక్తి ఉంది
కౌగిలిలో రక్తి ఉంది
ఏకతలో శక్తి ఉంది
ప్రీతి లోన రక్తి ఉంది
అందుకనే అక్షరాల
బంధంలో శక్తి ఉంది
అందుకనే సప్త స్వర
మేళంలో రక్తి ఉంది
అందుకనే అందరము
అనురాగం పంచి పంచి
కుల మతాల విస్మరించి
కలిసి మెలసి బ్రతుకుదాం

—కనమలూరు వెంకట శివయ్య